మహనీయులను మరువొద్దు

- మంత్రి సీతక్క
- గౌడ కులస్తులకు కాటమయ్య కిట్ల పంపిణీ

ములుగులో గౌడన్నలకు కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర

ములుగురూరల్/ వెంకటాపూర్, ఆగస్టు 18 : మహనీయుల జీవితాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ములుగు కలెక్టరేట్‌లో నిర్వహించిన సర్వాయి పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమానికి కలెక్టర్ టీఎస్ దివాకర అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా మంత్రి హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహనీయుల జీవితాలు, చరిత్ర, వారి త్యాగాలను గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం కల్లు గీత కార్మికులకు కాటమయ్య 100 రక్షణ కవచాలను మంత్రి సీతక్క అందజేశారు. అనంతరం మంత్రి సీతక్క కలెక్టర్ దివాకరను శాలువాతో సత్కరించి సహజ సిద్ధమైన పూలతో తయారు చేసిన రాఖీ కట్టారు. నేడు జరిగే రాఖీ పండను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని సూచించారు. 22న ములుగులో జరిగే తీజ్ ముగింపు ఉత్సవాలకు రావాలని కోరుతూ బంజారా నాయకులు పోరిక మోహన్‌లాల్, ఆంగోత్ రాజునాయక్, పోరిక సునీల్‌కుమార్, కుమార్‌పాడ్యలు సీతక్కతో పాటు కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు ఆహ్వాన పత్రికలను అందజేశారు. వెంకటాపూర్ మండలం పాపయ్యపల్లి గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, గ్రంథాలయాన్ని కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పెండింగ్‌లో ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రూ.2.15 కోట్లతో పాలంపేట రోడ్డు మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. శ్మశాన వాటిక నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో దాతలు భూములను విరాళంగా ఇచ్చి ప్రజల మనసులు గెలుచుకునేవారన్నారు. కానీ, నేటి కాలంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి విరాళంగా ఇవ్వడం సంతోషకరమన్నారు. సొంత నిధులతో భూమితో పాటు భవనం, గ్రంథాలయం ఏర్పాటు చేసి బహుమానంగా ఇచ్చిన తూడి రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీనివాస్, వెనుబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, సీఈవో సంపత్‌రావు, ఎక్సైజ్ సీఐ సుధీర్‌కుమార్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, డీడబ్ల్యూవో స్వర్ణలతా లెనినా, ఎంపీడీవో రాజు, ఎంపీవో శ్రీనివాస్, స్థల భవన దాతలు రవీందర్‌రెడ్డి, సుకేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మండల లక్ష్మి పాల్గొన్నారు.

గణపురం సొసైటీ సీఈవో సస్పెన్షన్

గణపురం, ఆగస్టు 18 : మండలకేంద్రంలోని పీఏసీఎస్ సీఈవో భిక్షపతిని సస్పెండ్ చేస్తూ శనివారం సాయంత్రం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు నెలల క్రితమే సీఈవోగా ఆయన నియామకమయ్యారు. ప్రభుత్వం 2018 నుంచి రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో రైతులకు న్యాయం చేసేందుకు సీఈవో తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి రుణమాఫీకి దరఖాస్తు చేశాడు. దీంతో ప్రభుత్వానికి అనుమానం రావడంతో గణపురం సొసైటీపై ప్రత్యేక బృందంతో ఆడిట్ చేయించారు. రికార్డులను పరిశీలించిన ఆడిట్ అధికారులు సొసైటీ అధికారులు తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించినట్లు తేల్చారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న అధికారులు సీఈవోను బాధ్యుడిగా చేస్తూ సస్పెండ్ చేశారు. కంప్యూటర్ ఆపరేటర్ విజయ్‌ని సీఈవోగా బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్ టీం ఆర్థిక సాయం

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 18 : భూపాలపల్లి మండలం గొర్లవీడుకు చెందిన తంగళ్లపల్లి రాజు ఇటీవల మృతిచెందగా ఆదివారం హెల్పింగ్ హ్యాండ్ టీం సభ్యులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.8500 నగదు, 25 కిలోల బియ్యం అందజేశారు.

మార్చిలో ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన శిలాఫలకం

సీసీ రోడ్డు కోసం తెచ్చిన ఇసుక, కంకర

వెక్కిరిస్తున్న శిలాఫలకం

- నెలలు గడిచినా వేయని రోడ్డు
- మండలంలోని అన్నిగ్రామాల్లో పూర్తయిన రోడ్లు
- పెద్దంపల్లిలో శంకుస్థాపనతోనే సరి

టేకుమట్ల, ఆగస్టు 18 : మండలంలోని పెద్దంపల్లి గ్రామంపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. మిగతా అన్ని గ్రామాల్లో రోడ్లు వేసి ఇక్కడ మాత్రం విస్మరించారు. పార్లమెంట్ ఎన్నిక ముందు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. పెద్దంపల్లి గ్రామంలో సైతం 14 మార్చి 2024లో రూ.10 లక్షల సీడీఎఫ్ నిధులతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ ముగియగానే అంతటా రోడ్లు పూర్తి చేసినా ఇక్కడ మాత్రం రోడ్డు పోయకుండానే వదిలేశారు. రోడ్లు ఎక్కడ పోయాలో గ్రామ సభ ద్వారా గుర్తించి తీర్మాణం సైతం చేశారు. శంకుస్థాపన చేసిన చోటే ఇసుక, కంకర పోయడంతో తమకు బురద కష్టాలు తీరుతాయనుకుంటే కళగానే మిగిలిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగతా గ్రామాలతో పోల్చుకుంటే తమ గ్రామానికి ఎమ్మెల్యే మంజూరు చేసింది ఒక్క పనే అని, అది కూడా శిలాఫలకంతోనే సరిపెట్టారని ఆరోపిస్తున్నారు. గత ఎమ్మెల్యే పోసిన రోడ్లు మాత్రమే ఇప్పుడు ఉన్నాయని, ప్రస్తుత ప్రభుత్వం తమ ఊరిలో తట్టెడు మట్టికూడా పోయలేదంటున్నారు. రూ. 10 లక్షల రోడ్డు పోయాల్సిం ఉండగా ఇప్పుడు రూ.5 లక్షలకు కుదించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి సీసీ రోడ్లు త్వరగా వేయించాలని, అలాగే వెలిశాల రోడ్డు కూడా త్వరగా పూర్తి చేసి రవాణా కష్టాలు తీర్చాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈని వివరణ కోరేందుకు ఫోన్ చేయ గా ఆయన స్పందించలేదు.

తమ గ్రామాన్ని ఎందుకు మరిచారో తెలియడంలేదు..

పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియగానే అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారు. కానీ, మా గ్రామంలో ఎందుకు వేయలేదో అర్థంకావడంలేదు. శంకుస్థాపనకు ముందే ఇసుక, కంకర తెప్పించి పెట్టడంతో రోడ్డు పోస్తరనే ఆశతో ఓట్లు వేశారు. ఎన్నికలు అయిపోయాయి.. కానీ రోడ్డు మాత్రం పడలేదు. గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులే కనబడుతున్నయ్. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏబీ లేదు. - కన్నూరి రమేశ్, పెద్దంపల్లి

ఘనంగా ముందస్తు రాఖీ వేడుకలు

గణపురం : రాఖీ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

గణపురం/ భూపాలపల్లి రూరల్, ఆగస్టు 18 : మండలంలోని పలు పాఠశాల్లో ఆదివారం ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. చెల్పూర్ జీపీ పరిధి ఎంజీఎం హైస్కూల్‌లో కరస్పాండెంట్ గ్యాదంగి సతీశ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచారు. అలాగే మండలకేంద్రంలోని ప్రోబెల్ మోడల్ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ ల్యాదల్ల కృష్ణ, కరస్పాండెంట్ పబ్బ శివశంకర్, శ్రీ నారాయణ హై స్కూల్‌లో కరస్పాండెంట్ అనిశెట్టి భాను చందర్, ప్రిన్సిపాల్ అనిశెట్టి స్రవంతి, బస్వరాజుపల్లి శ్రీ నేతాజీ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ఉడుత సాంబయ్య యాదవ్ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు నిర్వహించి పండుగ విశిష్టతను వివరించారు. ప్రిన్సిపాళ్లు, సహచర ఉపాధ్యాయులకు ఉపాధ్యాయినులు రాఖీ కట్టి సోదర, సోదరీమణుల అనుబంధాన్ని బలపరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి, గ్యాదంగి రమాదేవి, సిలువేరు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మధుకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో సీఐ నరేశ్ కుమార్, ఎస్సై సంధ్య, పోలీస్ సిబ్బందికి ఏఐఎస్ఎఫ్ గర్ల్స్ కమిటీ సభ్యులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ జడల రాజేశ్వరి, వైష్ణవి, రాధిక, మానస, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, పోతుల పవన్ పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి వరద

కన్నాయిగూడెం, ఆగస్టు 18 : మండలంలోని తుపాకులగూ డెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఆదివారం ఎగువ నుంచి 2 లక్షల 68 వేల 70 క్యూసెక్కుల వరదనీరు వస్తున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బరాజ్ మొత్తం 59 గేట్లను ఎత్తి ఉంచి వచ్చిననీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బరాజ్ పూర్తిస్థాయి నీటిమట్టం 83 మీటర్లుగా ఉంది. గోదావరిలో వరద పెరుగుతుండడంతో నీటిమ ట్టం 76.70 మీటర్ల ఎత్తుకు చేరుకుంది.

మూడు మోటర్లతో కొనసాగుతున్న దేవాదుల పంపింగ్..

దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఫేస్ 3లోని మూడు మోటర్లతో గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతోంది. మూడు మోటర్ల ద్వారా రోజుకు 87 5 క్యూ సెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌కు తరలిస్తున్నట్లు డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 18: గతేడాది నలుగురు వ్యక్తులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ఆదివారం ఎస్సై తిరుపతిరావు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చొక్కాల గ్రామానికి చెందిన గౌరారపు కృష్ణ, బీసీ మర్రిగూడెంకు చెందిన గగ్గురి రమేశ్, కొప్పుల మహేశ్, మండలకేంద్రానికి చెందిన మారిశెట్టి పార్థసారథి మొబైల్ ఫోన్లు పోగొట్టుకొని మీ సేవ ద్వారా పీఎస్‌కు ఫిర్యాదు చేశారన్నారు. సీఈఆర్ఐ పోర్టల్ సాయంతో బాధితుల ఫోన్లను గుర్తించి వారికి అందించినట్లు ఎస్సై తెలిపారు.

గొప్ప యుద్ధవీరుడు పాపన్న

- భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు
- ములుగు, జయశంకర్ జిల్లాల్లో పాపన్న జయంతి వేడుకలు
- హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

కృష్ణకాలనీ /భూపాలపల్లి రూరల్/ గోవిందరావుపేట/ మంగపేట/ గణపురం/ టేకుమట్ల, ఆగస్టు 18 : సర్దార్ సర్వాయి పాపన్న గొప్ప యుద్ధ వీరుడని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ములుగు, జయశంకర్ జిల్లాల్లో సర్దార్ సర్వాయిపాపన్న జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాపన్నగౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఎమ్మెల్యే హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేశారు. పాపన్న 17వ శతాబ్దంలోనే దోపిడీ, భూస్వాముల పెత్తం దారి వ్యవస్థకు ఎదురు తిరిగిన గొప్ప బహుజన విప్లవకారుడన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి శైలజ, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. గోవిందరావుపేట మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో వేణు, సురేందర్, శ్రీనివాస్, నర్సయ్య, మల్లేశ్, సుధాకర్, వెంకన్న, వాత్సవాయి సారయ్య, బొనగాని సారయ్య, మద్దెల ఐలమల్లు, ఆంజనేయులు, రాముడు, మల్లయ్య, సదానందం పాల్గొన్నారు. మంగపేట మండలంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ఏజెన్సీ గౌడ హక్కుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపకుడు బూర లక్ష్మీనారాయణగౌడ్, మండల అధ్యక్షుడు రావుల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు కారుపోతుల నర్సయ్యగౌడ్, రావుల సత్యంగౌడ్, లోడె శ్రీనివాస్ గౌడ్, పూజారి రాజు హాజరయ్యారు. గణపురం మండలకేంద్రంలో గౌడ సంఘం అధ్యక్షుడు మార్క కొమురయ్యగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని శివశంకర్ గౌడ్, మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణగౌడ్, ల్యాదల్ల సమ్మయ్య గౌడ్, బండి నాగరాజు గౌడ్ పాల్గొన్నారు. టేకుమట్ల మండలంలో గౌడ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు నేరేళ్ల రామకృష్ణగౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న మోకుదెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం భిక్షపతిగౌడ్, బహుజన నాయకులు కొటగిరి సతీశ్‌గౌడ్, కత్తి సంపత్‌గౌడ్, రేణుకుంట్ల సంపత్, ఎలుకటి రాజయ్య, గునిగంటి మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న సెంటర్‌లో ధర్మసమాజాజ్ పార్టీ, యాదవ మహాసభ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ, యాదవ మహాసభ నాయకులు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఎస్పీ పార్టీ, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్, సంపత్ కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు సదానంద యాదవ్, నాయకులు ఐలయ్య, వెంకీయాదవ్, రాములు యాదవ్, సతీశ్‌కుమార్, అశోక్‌కుమార్, డీఎస్పీ నాయకులు మహర్షి, గణేశ్, ధశరథం పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: పాపన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

టేకుమట్లలో..

గోవిందరావుపేట : నివాళులర్పిస్తున్న గౌడ నాయకులు

మాట్లాడుతున్న ఖాలీద్

2కే రన్‌ను విజయవంతం చేయాలి

మంగపేట, ఆగస్టు 18 : మత్తు పదార్థాలను నిర్మూలించాలని కోరుతూ ఈ నెల 29న 2కే రన్ నిర్వహిస్తున్నట్లు హోప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఖాలీద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం డానికి మండల కేంద్రంలో నిర్వహించనున్న 2కే రన్ విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. సంస్థ బాధ్యులు ప్రశాంత్, హుస్సేన్, సయ్యద్ ఫయాజ్, నరేందర్, శశికుమార్, సాయికిరణ్, రహమత్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు పచ్చి అబద్ధాలు

మంగపేట, ఆగస్టు 18 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ చేసిన ఆరు గ్యారెంటీల వాగ్దానం పచ్చి అబద్ధమని బీజేపీ నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆ పార్టీ మండలా ధ్యక్షుడు పీ సతీశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గారెంటీలని అబద్ధాలు చెప్పి గద్దనెక్కినట్లు తెలిపారు. రూ. 2 లక్షల రుణమాఫీ ఒకే దఫా చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మూడు దఫాలుగా రుణ మాఫీ చేశారని, అది పూర్తి స్థాయిలో చేయలేదని విమర్శించారు. ఎలాంటి షరతులు విధించకుండా వెంటనే రైతులందరికీ రుణ మాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 21న బీజేపీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి రైతువేదికల వద్ద ఆందోళన చేపడుతామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా నా యకుడు శ్రీనివాసరావు, బీజేవైఎం జిల్లా కార్య దర్శి ప్రశాంత్, మండల ఉపాధ్యక్షుడు రమేశ్, సాంబయ్య, మండల ప్రధానకార్యదర్శి చల్లా రాంకీ, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జానకిరావు, శ్రీను, నరేందర్ పాల్గొన్నారు.

రామప్పలో పూజలు చేస్తున్న భక్తులు

రామప్పలో సండే సందడి

వెంకటాపూర్, ఆగస్టు 18: మండలంలోని రామప్ప ఆలయం ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు సందర్శించగా ఆలయ అర్చకులు వారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు.

కాళేశ్వరంలో..

కాళేశ్వరం : శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా భక్తులు గోదావరి తీరంలో స్నాన్నాలు చేసి నదీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. పార్వతీ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు చేశారు.

గోదావరి మాతకు దీపాలు వదులుతున్న మహిళలు

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 18: మండల పరిధిలోని ఎదిర గ్రామ శివారులో ఆదివారం ఎక్సైజ్ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం –వాజేడు వైపు వచ్చి పోయే వాహనాలను తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపించారు. ఈ తనిఖీలో సీఆర్పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం కాలనీలో పారిశుధ్య పనులు

తరలివచ్చిన మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

ఇండ్ల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నమస్తే ఎఫెక్ట్

కృష్ణకాలనీ, ఆగస్టు 18 : భూపాలపల్లి మున్సిపల్ పరిధి వేశాలపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీలో మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. శనివారం నమస్తే తెలంగాణలో 'డబుల్ బెడ్‌రూం కాలనీలో విషజ్వరాలు' కథనం వెలువడిన విషయం తెలిసిందే.. దీనికి మున్సిపల్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. ఆదివారం తెల్లవారుజామునే పారిశుధ్య సిబ్బందిని తీసుకొచ్చి కాలనీలోని ఇండ్ల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తీసి ట్రాక్టర్ల సాయంతో తరలించారు. రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. మురుగు కాలువలు, రోడ్లపై బ్లీచింగ్ చల్లి శుభ్రం చేశారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి మధుసూదన్ ఆదేశాల మేరకు భూపాలపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి ఆధ్వర్యంలో కాలనీ కమ్యూనిటీ హాల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు రోహిణి మాట్లాడుతూ వైద్య శిబిరంలో 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, వీరి నుండి రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు పంపించామన్నారు. రిపోర్టు వచ్చిన తర్వాత మళ్లీ ప్రజల ఆరోగ్య స్థితి గతులను తెలియజేస్తామని తెలిపారు.

కాలనీ వాసులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రోహిణి

గణపురంలో దంచి కొట్టిన వాన

గణపురం, ఆగస్టు 18 : మండలకేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా రెండు గంటలపాటు ఎడతెరిపి లేకుండా ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. వ్యవసాయ పనులకు వెళ్లిన కూలీలు మధ్యలోనే పనులు ముగించుకొని ఇళ్లల్లోకి చేరుకున్నారు. రోడ్లన్నీ వరద నీటితో నిండిపోయాయి. చిరు వ్యాపారులు సైతం మధ్యాహ్నమే వ్యాపారాన్ని ముగించుకొని ఇళ్లల్లోకి వెళ్లిపోయారు.

మండలం కేంద్రంలో కురుస్తున్న భారీ వర్షం

రాఖీ కొనుగోళ్ల సందడి..

ములుగు రూరల్ : రాఖీలను కొనుగోలు చేస్తున్న మహిళలు

ములుగురూరల్/ కృష్ణకాలనీ, ఆగస్టు 18 : రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ సందడిగా మారింది. వ్యాపారులు రకరకాల రాఖీలు తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారు. ఆడపడుచులు పూర్తిగా ఫాన్సీ రాఖీలను ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారు. ఫాన్సీ రాఖీలు రూ.100 నుంచి ప్రారంభమై రూ. 150 వరకు ధర ఉంది. ములుగు జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు రాఖీలను విక్రయించే వ్యాపారులకు భలే గిరాకీ దొరికింది. దీంతో రాఖీల దుకాణాలు రద్దీగా మారాయి. రాఖీల ధరలు రూ.20 నుంచి ప్రారంభమై రూ.500పైగా ఉండగా.. రేట్లను లెక్క చేయకుండా మహిళలు రాఖీలను కొనుగోలు చేశారు.

కృష్ణాకాలనీ: కొనుగోలు చేస్తున్న మహిళలు

పిచ్చికుక్క దాడిలో ఏడుగురికి గాయాలు

గాయపడిన వ్యక్తికి చికిత్స చేస్తున్న వైద్యుడు

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 18 : పిచ్చి కుక్క దాడిలో ఏడుగురికి గాయాలైన సంఘటన మండలంలోని నూగూరు గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం పిచ్చి కుక్క వీధుల వెంట తిరుగు తూ వీధుల్లో బయటకు వచ్చిన వారిపై దాడి చేసిందని తెలిపారు. ఇం డ్ల ముత్యాలు, ఇండ్ల వెంకటేశ్, ఎం మణిక్యం, ఈ లక్ష్మయ్య, పీ లక్ష్మయ్య, శిరీష, మధుప్రియపై దాడి చేయగా, గాయాలయ్యాయి. వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

గుడుంబా పట్టివేత

వాజేడు, ఆగస్టు 18 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి తెలంగాణకు గుడుంబా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని టేకులగూడెం జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి ఛత్తీస్‌గఢ్ నుంచి రెండు బైకులపై వస్తున్న నలుగురు పారిపోయేందుకు ప్రయత్నించగా, వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 160 లీటర్ల గుండుబా ప్యాకెట్లు ఉన్నట్లు తెలిపారు. గుడుంబా తరలిస్తున్న చిన్నగొల్లగూడెం గ్రామానికి చెందిన రవీందర్, ధర్మావరం గ్రామానికి చెందిన మధు సూధన్‌రావు, పేరూరు గ్రామానికి చెందిన ప్రశాంత్, పూసూరు గ్రామానికి చెందిన కుర్సం నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోలీసులు నరేశ్, మరేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నవీన్ ఉన్నారు.

పట్టుబడ్డ నిందితులను చూపుతున్న పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్

టేకు కలప స్వాధీనం

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 18 : మండల పరిధిలోని తిప్పాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను అటవీ శాఖ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. అలుబాక సెక్షన్ అధికారి చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తిప్పాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా బొలెరో వాహనంలో టేకు కలపను తరలిస్తున్నారనే సమాచారం మేరకు.. సిబ్బందితో వెళ్లి దాడులు చేసినట్లు తెలిపారు. తమను గమనించిన స్మగర్లు వాహనంతో పాటు 10 టేకు దిమ్మెలను అక్కడే వదిలి పెట్టి పారిపోయారన్నారు. వాహనాన్ని, కలపను సీజ్ చేసి వెంకటాపురం అటవీ శాఖ కార్యాలయానికి తలించినట్లు తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ. 2 లక్షల 50 వేలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది మౌనిక, లక్ష్మయ్య, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.